# రిటైర్డ్ ఆఫీసరు భార్య

- సి. లలిత

"ఇదిగో, చూడు, ఈ ఉద్యోగం చెయ్యడం కష్టంగా ఉందనుకో. ఎన్నిప్రమోషన్లు వచ్చినా, ఎంత హోదా గల డిజిగ్నేషను ఉన్నా ఈ ఫ్యాక్టరీ ఉద్యోగాలంటేనే అంత. ఎప్పుడు వెడతానో ఎప్పుడు వస్తానో తెలియదు. డ్యూటీలో ఉన్నంతకాలం ఆఫీసు గదిలో పట్టుమని నాలుగు గంటలైనా కూర్చోడానికి వీలుండదు. ఎప్పుడూ ఏదో ప్రొబ్లమ్సే. చూడు, ఆఫైనాన్సు డిపార్టుమెంటు లక్ష్మీనారాయణ టైముకి వెళ్లి ఆ ఎయిర్‌కండిషన్డ్ రూములో కూర్చుని సాయంత్రం అయేసరికి ఇంటికి వస్తాడు. ఆదాయం, ఖర్చు అంటూఏవోలెక్కలు కట్టడమేగాని, ఫ్యాక్టరీరాబడిని పెంచలేడుగదా. కాని నాలాటివాడికైతే ఇంతాకష్టపడితే, కొంచెం అంచనాలు తప్పి ప్రొడక్షన్ కొంచెం దెబ్బతింటే, పైనుంచి అక్షింతలు తప్పవు. అసలు ఇంజనీరింగ్ చదివి ఈటెక్నికల్ జాబ్‌లో చేరడం బుద్ధి తక్కువై చేసిన పననుకో. ఆ లక్ష్మీనారాయణ ఏం చదివాడు. ఒఠి ఎమ్మేకదా. అయితే మాత్రం ఇప్పుడు చూడు, ఎలావెలిగిపోతున్నాడో. దేనికైనా అదృష్టం అంటూ ఉండాలి" అన్నాడు సుబ్రహ్మణ్యం భార్యతో ఒకనాడు ఫాక్టరీనుండి ఇంటికి ఆలస్యంగా వచ్చి.

"ఏమో నాకదంతా తెలియదు. మా వారు జనరల్ మానేజరని నలుగురిలో చెప్పుకోడానికి నాకు గర్వంగానే ఉంటుంది. ఇంక ఉద్యోగంలో కష్టమన్నారూ. ఏ ఉద్యోగంలోనైనా కష్టాలు ఉంటూనే ఉంటాయండి. అయినా కష్టపడి నంతమాత్రాన అందరికి మీకు వచ్చినట్లు ప్రమోషన్లు వస్తున్నాయిటండి. కష్టపడటం కాదు ఇక్కడ ముఖ్యం. మనతెలివితేటలతో మనం చేసేపనిలో రాణింపు సంపాదించడం అనేది ముఖ్యం. అది అందరికీ సాధ్య మవుతుందిటండీ - గానుగను నడిపే ఎద్దు కష్టపడుతుంది. ఎంత కష్టపడినా దానిదెప్పుడు గానుగెద్దు జీవితమే కదా. అంతదాకా ఎందుకు నన్నే చూడండి. నాదీ ఇంచుమించు 'గానుగెద్దు జీవితమే, దీనికి ఎదుగూ బొదుగూ అంటూ ఉందా? పొద్దున్న లేచిందిమొదలు రాత్రి నిద్రపోయే వరకు ఏదోపని ఉంటూనే ఉం టుంది. చూస్తున్నారుకదా. కాని దీనికి గుర్తింపుగాని, ప్రమోషన్లుగాని ఏమైనా ఉన్నాయా. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న సామెత బ్రతుకునాది. మీకు, పిల్లలకు ఏ సదుపాయాల్లో లోటువచ్చినా సాధింపులు వస్తాయిగాని, అన్నీ సరిగా సమకూర్చినప్పుడు ఎప్పుడైనా పొగడ్తలకు నోచుకున్నానా?

"ఇంతకీ నేను చెప్పేదేమిటంటే, మీరుకష్టపడుతున్నారు. కాదనను కాని మీ కష్టానికి గుర్తింపువస్తోంది. ఉద్యోగంలో మీ హోదా పెరుగుతోంది. మీ హోదాతో ఆదాయం కూడా పెరుగుతోంది. మనకి నలుగురులోను గౌరవం వస్తోంది. అయినా ఇంక అట్టే సర్వీసు లేదు గదండి. ఇప్పటి కష్టానికేం. రిటైరయినతర్వాత ఏ గుర్తింపూ లేక పడే కష్టాలలో ఈ కష్టం ఒక లెక్కలోకిరాదు." అంది అనసూయ.

"అసలు నీ దగ్గర చెప్పుకోడం నాది తప్పు. నువ్వు ఇంట్లో చేసేపని, నా ఫ్యాక్టరీ పని ఒకటే నంటావా. ఒకసారి నాతో డ్యూటీకిరా. నా ఉద్యోగం ఎటువంటిదో తెలుస్తుంది. ఆ వర్కర్సుతో పడే కష్టాలు నీకేం తెలుస్తాయే. ప్రతివాడికీ జీతాలు పెరగాలి. బోనస్‌లుకావాలి. కాని పనిదగ్గరకొచ్చేసరికి ఎప్పుడూ గొడవలే. ఎప్పుడూ ఏదో లేబరుట్రబులే. అదే ఆ లక్ష్మీనారాయణని చూడు. వాడికి ఏ గొడవలూలేవు. హాయిగా కుర్చీలో కూర్చుని ఆర్డర్లిస్తూ క్రింది ఆఫీసర్లచేత పనులు చేయిస్తూవుంటాడు."

"ఎవరి కష్టాలు వారికుంటాయండీ. మీరు కష్టపడటం లేదనను.కాని ఆ లక్ష్మీనారాయణగారి ఉద్యోగం అంతా సుఖమయమే అనుకోను. ఆయన డిపార్టుమెంటు ఫైనాన్సు అంటున్నారుకదా. ఇంటినైనా, ఫాక్టరీనైనా నడిపించేది డబ్బేకదండి. మన యింటిని సరిదిద్దడానికి మీరిచ్చేడబ్బుతో నేను పడేకష్టాలు ఆలోచిస్తూ ఉంటే, ఆ లక్ష్మీనారాయణగారు ఒక పెద్ద ఫాక్టరీని నడపడానికి ఫైనాన్సుహెడ్‌గా పడేకష్టాలు నేను అర్థంచేసుకోగలను," అంది అనసూయ.

"ఎప్పుడు ఏ విషయం మాట్లాడినా, ముందు నువ్వు ఇంట్లో పడే కష్టాలు వల్లిస్తూ ఉంటావు. ఇది నీకుబాగా అలవాటయిపోయింది. అసలు నీతో నాగోడు చెప్పుకోడం నాదీ తప్పు," అంటూ రుసరుసలాడుతూ న్యూస్‌పేపరు తీసుకుని బెడ్‌రూములోకి వెళ్లాడు సుబ్రహ్మణ్యం.

* * *

"ఈ జీవితం మీద విరక్తిభావం కలుగుతోందనుకో సుబ్రహ్మణ్యం. ఒక్కొక్కప్పుడు చచ్చిపోవాలని అనిపిస్తుంది నాకు" అన్నారు చక్రపాణి.

"అదేవిటండి! మీ పద్ధతి నాకేం నచ్చలేదు. ఎప్పుడు మాట్లాడినా ఇలాగే మాట్లాడుతారు. 'సుఖదుఃఖాలు రాత్రింబగళ్లు లాటివి. ఈ సుఖదుఃఖాలు రెండూ దేవుడి ప్రసాదాలే, అసలు దుఃఖమనేది లేకపోతే సుఖానికి విలువెక్కడుంది' అన్నాడు ఒక మహానుభావుడు. అంచేత ఎంతవయస్సు వచ్చినా జీవితంలో మంచినే చూడడానికి ప్రయత్నించాలి. రిటైర్‌మెంటు అనేది జీవితంలో ఒక భాగం. రిటైరయి నంతమాత్రాన జీవితానికి అంత్యావస్థ వచ్చిందని భావించకూడదు. ఇది జీవితంలో ఒక మార్పు. ఆ మార్పును సద్వినియోగం చేసుకోడానికి ప్రయత్నించాలిగాని, ఈ మార్పు జీవితం మీద విరక్తిభావాన్ని కలిగించేలా చూడకూడదు. స్థిరమైన ఉద్యోగం లేకపోవచ్చు. ఎక్కువపనులు చేసే ఓపిక లేక పోవచ్చు. కాని ఉన్నంతలో ఏదో వ్యాపకం పెంచుకుని సమాజానికి ఏ కొద్ది మాత్రమైనా ఉపయోగపడవచ్చు. మనస్సులో చేయాలనే పట్టుదల గలగానే గాని చెయ్యడానికి అనేక మార్గాలుం టాయి." అన్నాడు సుబ్రహ్మణ్యం

"చక్రపాణి సుబ్రహ్మణ్యం కంటె ఎనిమిది సంవత్సరాలు ముందు రిటైరయారు. ఇద్దరూ ఒకే ఊళ్లో చాలా కాలం పనిచేశారు. అంచేత కొంచెం సన్నిహితత్వం ఏర్ప డింది. రిటైరయిన తర్వాత ఒకే చోట స్థిరపడ్డారు. తను రిటైరయిన ఈ ఆరునెలలలో సుబ్రహ్మణ్యం చక్రపాణిని తరచూ కలుస్తూ ఉండేవాడు.

"నువ్వు చెప్పినది నిజమే కావచ్చు. కాని ఇంక నాకేం ఉంది ఈ లోకంలో. నేను వచ్చినపని అయిపోయింది. భగవంతుడు నాకు నిర్ణయించిన పనులన్నీ సక్రమంగా జరిపాను. ఇంతవరకు శారీరకంగా ఏ బాధా అనుభవించలేదు. వయస్సు పైబడుతున్న కొద్దీ శరీరసమస్యలు అధికమవుతాయి, ఇంకొకరిపై ఆధారపడే అవసరాలుకలుగుతాయి. ఆ అవసరాలను తీర్చే అవకాశాలు. ఆధారాలు తగ్గుతాయి. అసలు ఇతరులమీద ఆధారపడే అవస్థ కలుగ కూడదని నా కోరిక. ఆకోరికే నన్ను మరణం వైపు తిప్పుతోంది. మన శరీరావయవాలు మనస్వాధీనంలో ఉన్నపుడే మనకు అంత్యస్థితిరావడం కూడా అదృష్టమేనంటాను." అన్నారు చక్రపాణి.

"మనం ఇతరుల మీద ఆధారపడే అవస్థ కలుగుతుందనే ఎందుకనుకోవాలి. ఇక్కడ ఒక విషయం చెప్పమన్నారా. 'మన ఆయుః ప్రమాణం పెరగడం గాని, తరగడం గాని మనచేతిలోనే ఉంటుంది. 'నిరంతరం ఆనందంగా, శాంతంగా, పవిత్రభావంతో ఉన్నప్పుడు మన ఆయుః ప్రమాణం పెరుగుతుంది,' అన్నాడు ఒక మహానుభావుడు. అంచేత మనకు అందుబాటులో ఉన్న ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా చూసుకోవాలి. పవిత్రమైన ఈ కాలాన్ని కేవలం మనకోసమేగాక సాటివారి కోసం కొంతవినియోగించాలి. నేను చెప్పినట్లు మీరు ఏదో వ్యాపకాన్ని పెట్టకోవడం మంచిది. దానివలన మీకు మనోబలము, శరీరబలమూ రెండూ వస్తాయి.నేను రేపు పనిమీద ఊరు వెడుతున్నాను. తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ కలుస్తాను. మనం వివరంగా చర్చించుకుందాం" అని చెప్పి చక్రపాణి దగ్గర శలవుతీసుకున్నాడు సుబ్రహ్మణ్యం.


* * *

"చక్రపాణిగారు ఫోన్‌చేసారు" అంది భర్త బజారునుంచి ఇంటికి రాగానే అనసూయ.

"ఏవంటాడు" అడిగాడు సుబ్రహ్మణ్యం.

"నాకేమీ చెప్పలేదు మీరు బజారుకెళ్లారని చెప్పగానే 'అలాగా' అంటూ ఫోను పెట్టేశారు. ఏవిటండి, ఆయన ఎప్పుడు ఏదో పోగొట్టుకున్న వాడిలా నిర్లిప్తంగా మాట్లాడతారు. బ్యాంకులో కావలసినంత డబ్బు. ఇక్కడ తను ఉంటున్నది కాక ఇంకో రెండు ఇళ్లు ఉన్నాయని విన్నాను. పెన్షను కూడా బాగానే వస్తుందనుకుంటాను. పిల్లలందరూ పెద్దవాళ్లయి ఎవరి సంసారాలు వాళ్లు చూసుకుంటున్నారుకదా. మరి ఆయన కెందుకంత వైరాగ్యభావం?" అడిగింది అనసూయ.

"నీ ఉద్దేశ్యంలో డబ్బుంటే అంతా సుఖసంతోషాలనేనా. మా వయస్సులలో డబ్బు సుఖాన్నివ్వలేదే.ఈ వయస్సులోకావలసినది తనుపెంచి పెద్దచేసి ఒక యింటి వారిగా చేసిన పిల్లల ప్రేమానురాగాలు. అవి చక్రపాణికి కరువయ్యాయి. పిల్లలెవ్వరూ ఆయన విషయం పట్టించుకోరు. ఈ ఉన్న ఆస్తినంతా ఏంచేస్తాడోననే భయం కూడావారికి లేదు. తమ తండ్రి గురించి వారికి పూర్తిగా తెలుసు. డబ్బు ఎంత ఉన్నా, ఇంకా యింకా సంపాదించాలనే ఆశతప్పు, ఉన్నదాంట్లో చేతనయినంతవరకు ఎవరికైనా సహాయంచేద్దామనే ఆలోచన ఆయనకెప్పుడూ కలుగలేదు. ఇదంతా ఆయన పిల్లలకు తెలుసు. తమతండ్రి సంపాదనంతా తమకే వస్తుందని. అంచేతనే ఆయన విషయం పట్టించుకోరు. అందులో ఆయన భార్యపోయి నప్పటినుంచి ఒంటరితనం పీడిస్తోంది. చచ్చిపోవాలని ఉందని, ఇంక తనకు ఈలోకంలో అనుభవించలసింది ఏముంది అంటూ ఎప్పుడూ ఏవేవో మాట్లాడుతూ ఉంటాడు. ఈ రిటైర్మెంటు అనేది మనిషికి ఒక శాపం లాంటిది. జీవితంలో ఉద్యోగ విరమణ తర్వాతే నిజ మైన కష్టాలన్నీ ప్రారంభ మవుతాయి. అందుకే నేను మళ్లీ ఉద్యోగప్రయత్నం చెయ్యాలనుకుం టున్నాను."అన్నాడు సుబ్రహ్మణ్యం.



"ఉద్యోగం చేస్తున్నంతకాలం ఈ ఉద్యోగం చెయ్యలేకపోతున్నాననుకో. దీనికి ఒకఫిక్సెడ్ టైమంటూ లేదు. ఫాక్టరీ ఉద్యోగాలు ప్రాణాలు తోడేస్తాయనుకో, అంటూ బాధపడుతూ ఉండేవారు ఇప్పుడు కావలసిన విశ్రాంతి దొరికితే మళ్లీ ఉద్యోగం చేస్తానంటారేవిటండీ. ఇప్పుడంత ఉద్యోగం చేయవలసిన అవసరం ఏ వచ్చింది?" అడిగింది అనసూయ.

"ఇది నీ మామూలువరసే. నేనేమైనా చెప్తే దానికి వ్యతిరేకంగామాట్లాడడం నీకు బాగా అలవాటయిపోయింది.నేను చూస్తున్నాను గదా. మొదటినుంచి నీ స్వభావమే అంత, ఉద్యోగం పురుషలక్షణం అన్నారు. రిటైరయినంతమాత్రాన ఏమీ చెయ్యకూడదని ఏమీ లేదు. ఇంట్లో ఇలా ఖాళీగా కూర్చుని ఉంటే నేను కూడా చక్రపాణిలా తయారయి మరణంకోసం ఎదురు చూస్తూ ఉండాలి." అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏవిటండి ఆ మాటలు, ఉద్యోగం చెయ్యాలనుకుంటే చెయ్యండి. నాకేం పోయింది. ఇంచుమించు ముప్పయి అయిదేళ్లు ఉద్యోగంలో కష్టపడ్డారుకదా, ఇప్పుడువిశ్రాంతి దొరికినప్పుడు ఎందుకుమళ్లీ శరీరాన్ని కష్టపెట్టడం అంటున్నానంతే. మీరు ఉద్యోగం చేసినా, చెయ్యకపోయినా, నాకు ఈ యింటి ఉద్యోగం పెర్మనెంటే కదా!" అంది అనసూయ.

"సరే... ఇంటిపని నేను చేస్తానిక. అదీ ఓ ఉద్యోగమేగా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"చాల్లెద్దురూ, ఎవరైనా వింటే నవ్విపోతారు. మాటవరసకన్నాను కాని, ఆడదానికి ఇంటిపని ఒకపనిలా కనబడదు. స్త్రీజీవితంలో అదీ ఒక భాగమే. దాని తర్వాతనే మరేదైనా వ్యాపకం" అంది అనసూయ.

"ఇంతకీ నేను చెప్పేది పూర్తిగా వినకుండానే ఏవేవో మాట్లాడేసావు. ఉద్యోగ ప్రయత్నం అన్నాను కదూ. మనం చేసేపనికి డబ్బుతో విలువకట్టేదే ఉద్యోగం అవక్కరలేదు. మనం చేసేపనివల్ల మనకు డబ్బురూపంలో లాభంకనబడకపోయినా, అది ఏ కొంతమందికైనా ఉపయోగపడి, వారి జీవనోపాధికి అవకాశం కల్పించేలా ఉంటే అదీ ఒక ఉద్యోగమే."

"మంచి పని అని మీకు తోచినది చేస్తానంటే నే నెందుకు అడ్డపడతానండీ. ఇప్పుడిప్పుడే కదా కొంచెం టైము దొరికి విశ్రాంతి పొందుతున్నారు. మళ్లీ శరీరానికి అనవసర శ్రమ కలిగించడం ఎందుకని నేను అంటున్నానంతే. అయినా మీరు చేయాలనుకుంటున్న ఈ సమాజోద్ధరణ మాటలతో అయ్యే పనికాదు గదండి. దానికి కావలసినధనభారన్ని మీరు మోయగలరా?" అడిగింది అనసూయ.

"నేను చేసేది సమాజోద్ధరణ కాదు. నాకు పూర్తిగా సమాజాన్ని మార్చేయాలనే ఉద్దేశ్యంలేదు. అది అసాధ్యమనీ నాకు తెలుసు. ఏదో నాకు చేతనయిననంత వరకు ఏ కొద్ది మందికైనా తమ జీవితాలకు తమ స్వంతసారథ్యం వహించగల శక్తిని కలుగజేస్తే అదే చాలు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అది మాటలతో అయేపనికాదు గదండీ. దానికి మీ ప్రయాస మాట ఎలా ఉన్నా వ్యయభారం ఉంటుంది గదండీ. ఆడబ్బంతా ఎక్కుడ నుంచి తేగలరు?" అడిగింది అనసూయ.

"మనం ఒక పని చెయ్యాలనే దీక్ష, పట్టుదల మనలో కలగాలేగాని డబ్బు అనేది ఒక పెద్ద అడ్డంకి అవదు. మన పిల్లలు వాళ్ల సంసారాలు వాళ్లు నడుపుకుంటు న్నారు. వాళ్లకి మన డబ్బు అక్కరలేదు. మనకు వచ్చే డబ్బులో మన అవసరాలకు పోను కొంతమిగలకపోదు. ముఖ్యంగా చక్రపాణిలో మార్పు తీసుకురావాలని నా ఆలోచన. మరణాన్ని ఆహ్వానిస్తూకూర్చున్న వాడికి డబ్బుమీద ఉండే ఆమమకారాన్ని తొలగించి, ఆ డబ్బును సద్వినియోగం చేయించగలననే ధైర్యం నాలోవుంది అదే గనుక నేను చేయ గలిగితే, ఆయన వైరాగ్యాన్ని, నిర్వేదాన్ని పోగొట్టడమే కాక, ఇంతవరకు ఆయనకు చేయగలిగిన సత్తా ఉన్నా చేయని మంచిపనికి నాంది పలికిస్తాను. మనం కష్టపడి విత్తనం నాటాలేకాని, అది మహా వృక్షమవటానికి మన సంకల్ప సహకారాలతోబాటు దైవసహాయం కూడా అందుతుంది. మొదట కావలసినది మనలో ఉన్న శక్తి సామర్థ్యాలను చైతన్యవంతంచెయ్యాలనే ధృఢసంకల్పం. ఆ సంకల్పమే ఉంటే మన గమనానికి ఏ అడ్డూరాదు."

"మీరు ఏదో సత్కార్యం చెయ్యాలని ప్రయత్నిస్తూ ఉంటే నేనెందుకు అడ్డువస్తానండీ ఇప్పటివరకు మీ జీవితంలో భాగం పంచుకున్నట్లే, మీ యీ భవిష్యత్ కార్యక్రమంలో కూడా నా బాధ్యతను నిర్వహించడానికి నాశాయశక్తులా ప్రయత్నిస్తాను." అంది అనసూయమ్మ

"నీ సంగతి నాకు తెలుసు. నువ్వు ఏం చెప్పినా నామంచికే చెప్తావని నాకు తెలియంది కాదు. మనం చేబడుతున్న ఈ కర్తవ్యం సఫలీకృతమవుతుందనే ఆశిద్దాం. కర్తవ్య సాధన భగవన్నామస్మరణతో సమానం. 'వర్క్ ఈజ్ వర్షిప్' అన్నారు పెద్దలు," అని చిరునవ్వుతో భార్యవీపు తట్టి ఉత్సాహంగా అక్కడి నుంచి కదిలాడు సుబ్రహ్మణ్యం. ❐